క్లుప్తంగా

మంత్రి దామోదర ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న మంత్రి దామోదర

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రంలోని వట్‌పల్లి వెంకట్ ఖాజా షరీఫ్ దర్గా ఉత్సవాల్లో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. నిర్వాహకులు మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. మత సామరస్యానికి ప్రతీక అయిన వెంకట ఖాజా షరీఫ్ దర్గాకు గంధాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు దిలీప్‌కుమార్ జ్యోషి, మండల యువజన కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

108 అంబులెన్స్ పని తీరు భేష్



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న హరిరామకృష్ణ

కొండపాక(గజ్వేల్): 108 అంబులెన్సు సిబ్బంది పనితీరు బాగుందని సిద్దిపేట జిల్లా కోఆర్డినేటర్ హరిరామకృష్ణ కితాబిచ్చారు. బుధవారం 108 అంబులెన్స్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఏ చికిత్సలకు ఏఏ మందులు, పరికరాలు వాడుతున్నారన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరిరామకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు 108 అంబులెన్స్‌పై ఉన్న నమ్మకాన్ని మరింతగా బలపడేలా సేవలందించాలని కోరారు. చికిత్సను అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని చెప్పారు. మెడికల్ టెక్నీషియన్ మహేందర్, పైలట్ రమేష్ పనితీరు ప్రశంసనీయమని చెప్పారు.

పట్టభద్రులందరూ ఓటు వేయాలి

పటాన్‌చెరు టౌన్: నేడు జరిగే మెదక్ – ఆదిలాబాద్ – నిజామాబాద్ – కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని, పోలింగ్ శాతాన్ని పెంచేలా కృషి చేయాలని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరక్షరాస్యులతో పోలిస్తే అక్షరాస్యులు ఎన్నికల్లో ఓటు వేయడానికి బద్ధకించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని.. ప్రశ్నించే గొంతుకలుగా మారాలంటే తమ కోసం పని చేసే అభ్యర్థికి ఓటు వేయాలన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్: బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీకి సంబంధించిన క్యాలెండర్, డైరీని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రేయారెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు అంజాగౌడ్, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌నాయక్, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నగేష్, మశ్చందర్, బస్వరాజ్, నర్సింహులు, మన్నాన్, నారాయ ణ, దస్తగిరి పాల్గొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తు న్న ప్రసన్న హరికృష్ణకు భూపాల్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. పట్టభద్రుల ఓటర్లు ప్రసన్నహరి కృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేయాలని కోరారు.

టీవీ, ఇన్వర్టర్ బహూకరణ

నారాయణఖేడ్: పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకులానికి బుధవారం మైనార్టీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రూ.65 వేల విలువ చేసే టీవీ, ఇన్వర్టర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా యాక్షన్ కమిటీ బాధ్యులు తాహెర్, మైనోద్దీన్‌లు మాట్లాడుతూ పరీక్షల సమయం కావడంతో కరెంటు సమస్య ఉన్న సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఇన్వర్టర్, టీవీని బహూకరించినట్లు తెలిపారు.

ప్రారంభమైన దుర్గమ్మ జాతర

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన దుర్గమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం పోతరాజు గావు, బండ్లు, బోనాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు జాతర నిర్వాహకులు తెలిపారు.

సర్వం శివమయం

శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. శివనామస్మరణతో ఆలయాలన్నీ మారుమోగాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా వ్యాప్తంగా వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాల వద్దకు పెద్ద ఎత్తున బారులు తీరారు. స్వామివారికి మారేడు దళాలతో ప్రత్యేక పూజలు చేసి, అభిషేకాలు నిర్వహించారు. రుద్రాభిషేకాలు, అఖండ శివనామస్మరణలతో వర్గల్ శంభునిగిరిలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



తొగుటలో భవానీ చంద్రమౌళేశ్వరుల కల్యాణం



హుస్నాబాద్ రూరల్: పొట్లపల్లిలో శివుడికి అభిషేకం చేస్తున్న మంత్రి పొన్నం



సిద్దిపేటరూరల్: వెంకటాపూర్‌లో హరీశ్‌రావుకు జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు



జగదేవ్‌పూర్ మండలం పిటివెంకటాపూర్‌లో పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి



బెజ్జంకి మండలం లక్ష్మీపూర్‌లోని కాశీలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ వేడుకలు



నంగునూరు(సిద్దిపేట): బద్దిపడగలో రాజరాజేశ్వరి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



కొండపాకలోని రుద్రేశ్వర దేవాలయంలో బారులు తీరిన ప్రజలు



గజ్వేల్ రూరల్: ప్రజ్ఞాపూర్‌లోని పార్థీశ్వరాలయంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో భక్తజనం



గజ్వేల్ రూరల్: శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



వర్గల్ లోని స్వయంభు శంభులింగేశ్వరుని అభిషేకపూజలో భక్తులు

అంగన్‌వాడీలో అందరికీ అందని దుస్తులు

సగం మంది చిన్నారులకే పంపిణీ

హుస్నాబాద్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రంలోని కొందరి చిన్నారులకే దుస్తులు పంపిణీ చేశారు. మిగతావారికి నేటికీ అందించలేదు. అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు కూడా దుస్తులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో గత ఏడాది ఆగస్టులోనే ఒక్కొక్క విద్యార్థికి రెండు జతల దుస్తులను శిశు సంక్షేమశాఖ నుంచి సరఫరా చేశారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకే దుస్తులు సరఫరా చేశారు. మరో కేంద్రంలోని చిన్నారులకు అందించలేదు. దీంతో తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇస్తే అందరికీ ఇవ్వాలని, పిల్లల మధ్య వ్యత్యాసం చూపడంపై అంగన్‌వాడీ టీచర్లను ప్రశ్నిస్తున్నారు.

హుస్నాబాద్ ప్రాజెక్టు పరిధిలోని అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి మండలాల్లో 211 కేంద్రాల్లో 4,324 మంది విద్యార్థులున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో దుస్తులు అందిస్తున్న సీడీపీఓతో అధికారులు (ఫైల్)

ప్రభుత్వ పాఠశాలల ఆవరణలోని 98 కేంద్రాల్లోని 2,376 మంది చిన్నారులకు రెండు జతల దుస్తులను అందించారు. మిగతా 113 కేంద్రాల్లోని 1,948 మంది విద్యార్థులకు దుస్తులు అందలేదు. పోతారం(ఎస్) గ్రామంలో ఒకటి పాఠశాలలో, మరో కేంద్రం ఎస్సీ కాలనీలో ఉంది. పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ పిల్లలకు దుస్తులు ఇచ్చి ఎస్సీ కాలనీ పిల్లలకు దుస్తులు ఇవ్వకపోవడంతో వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దుస్తులు రాగానే అందిస్తాం

మా ప్రాజెక్టు పరిధిలో 211 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 98 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో నడుస్తున్నాయి. మిగతా కేంద్రాలు ఆయా గ్రామాల్లో నిర్మించిన అంగన్‌వాడీ భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ఒక ఊరులో రెండు కేంద్రాలు ఉన్నప్పుడు ఒక కేంద్రానికి ఇచ్చి మరో కేంద్రానికి ఇవ్వవకపోతే ఎవరికైనా కోపమే.. దుస్తులు రాగానే అందిస్తాం.

–జయ, సీడీపీఓ, హుస్నాబాద్

క్రీడల్లో యువత సత్తా చాటాలి

సీఐ లతీఫ్

తొగుట(దుబ్బాక): గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని సీఐ లతీఫ్ సూచించారు. మండలంలోని ఎల్లారెడ్డిపేటలో శివరాత్రి పర్వదినం సందర్భంగా మాజీ ఎంపీటీసీ వెలుపుల స్వామి నిర్వహించిన క్రికెట్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ క్రీడలు నిర్వహించి యువతను ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం స్వామి మాట్లాడుతూ.. క్రికెట్ పోటీల్లో 8జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ 10వేలు, ద్వితీయ బహుమతి రూ 5వేలు నగదు 27న సీఐ చేతుల మీదుగా అందజేస్తామని తెలిపారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

బెజ్జంకి(సిద్దిపేట): ఆర్‌వీఎంబీపీ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఓపెన్ గు ఆల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం బెజ్జంకిలో ప్రారంభించారు. ఈ టోర్నీలో విన్నర్ జట్టుకు రూ.లక్ష, రన్నరప్ జట్టుకు రూ.50 వేలు నగదుతో పాటు షీల్డులు అందిస్తామని అకాడమీ కమిటీ తెలిపింది. అనంతరం బెజ్జంకి ఎస్ఎల్ఎన్ జట్టు, గుగ్గిల్ల జట్టులతో ఫ్రెండ్లీ మ్యాచ్ నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు మహేందర్, సీపీఐ మండల కార్యదర్శి రూపేష్, కమిటీ సభ్యులు మానాల రవి, మధు, సూర్యప్రకాష్, సురేష్ పాల్గొన్నారు.



క్రీడాకారులకు జర్సీలు అందజేసిన సీఐ లతీఫ్, స్వామి

12 గంటలు రోడ్డుపైనే మృతదేహం

- కనికరించని మున్సిపల్ అధికారులు, సిబ్బంది
- తల్లడిల్లిన కూతురు
- పరిచయస్తుల సహకారంతో అంత్యక్రియలు

జోగిపేట(అందోల్): అభాగ్యురాలైన వృద్ధురాలి శవం రోడ్డుపై 12 గంటల పాటు ఉన్నా మున్సిపల్ సిబ్బంది కన్నెత్తి చూడలేదు. అంత్యక్రియలు నిర్వహించాలని కూతురు వేడుకున్నా కనికరించలేదు. వివరాలిలా ఉన్నాయి. జోగిపేట పట్టణంలో విద్యావతి (68) అనే వృద్ధురాలు అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని ఆనుకొని ఉన్న ఒక గుడిసెలో నివాసం ఉంటూ కాగితాలు, పాత సామన్లు సేకరించి వాటిని అమ్ముకొని తన కూతురు అశ్వినితో కలిసి జీవనం సాగిస్తుంది. కుమార్తెకు వివాహం చేసింది. కుమార్తె భర్త ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో చౌటకూరు మండలం శివ్వంపేట ప్రాంతంలోని కంపెనీలో పని చేస్తోంది. శివరాత్రి పండుగ నేపథ్యంలో తల్లి వద్దకు వచ్చిన అశ్విని అమ్మా..అమ్మా అంటూ పిలిచినా ఉలుకు పలుకూ లేకపోవడంతో బోరున విలపిస్తూ కూర్చుంది.



తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న కూతురు అశ్విని

ఎవరూ లేకపోవడంతో పక్కనే ఉన్న మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి తన తల్లి అంత్యక్రియలు చేయాలని కోరింది. పోలీసులకు చెబితేనే చేస్తామని వారు చెప్పారు. రోడ్డు మీద వెళ్తున్న పోలీసులకు కూడా చెప్పినా మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎవరూ రాకపోవడంతో పటాన్‌చెరు ప్రాంతంలో తనకు తెలిసిన వారికి కూతురు ఫోన్ చేసింది. వారు వచ్చి మున్సిపల్ అధికారులను వేడుకున్నా స్పందించలేదు. దీంతో రూ.2వేలకు అంబులెన్స్‌ను మాట్లాడుకొని రూ.1,500కు జేసీబీతో గోతి తీయించి అంత్యక్రియలు పూర్తి చేశారు. తల్లి మృతదేహం వద్ద కూతురు ఏడవడం రోడ్డుపై వెళ్లే వారి హృదయాలను కలిచివేసింది.

ఆకాశాన్నంటిన పండ్ల ధరలు

కౌడిపల్లి(నర్సాపూర్): మహాశివరాత్రి సందర్భంగా బుధవారం పండ్ల ధరలు ఆకాశాన్నంటాయి. పండుగ సందర్భంగా ఉపవాసదీక్ష చేపట్టిన ప్రతీ ఒక్కరు పండ్లు తిని. దీక్ష విరమిస్తారు. దీంతో పండ్ల వ్యాపారులు ఒక్కసారిగా ధరలను పెంచారు. అరటిపండ్లు డజన్ రూ. 80 నుంచి రూ 100 విక్రయించారు. దీంతో పాటు వాటర్ మిలన్ సైజును బట్టి రూ. 100కు పైగా విక్రయిస్తున్నారు. ద్రాక్ష రూ. 100కిలో, సంత్రాలు, పైనాపిల్, దానిమ్మ అలా అన్నింటి ధరలను పెంచారు.



సెలవు రోజుల్లో తరగతులా..?

ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆదిత్య

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహాశివరాత్రి పర్వదినం నాడు ప్రభుత్వం సెలువు ప్రకటించినా కార్పొరేట్ పాఠశాలలు తరగతులను నిర్వహించడం సరికాదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆదిత్య అన్నారు. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజున తరగతులు నడుపుతున్న కార్పొరేట్ పాఠశాలల తరగతులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ పలు పాఠశాలలు సెలవు రోజున కూడా తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని తెలిపారు. ఇలాంటి పాఠశాల యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని, పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి పరశురాం, జోనల్ ఇన్‌చార్జి సాయిశంకర్, టెక్నికల్ సెల్ కన్వీనర్ వసంత్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆదిత్య తదితరులు

మంచినీరు, మజ్జిగ పాకెట్ల పంపిణీ

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల జాతరలో బుధవారం భారతీ సిమెంట్ ఆధ్వర్యంలో భక్తులకు నీరు, మజ్జిగ పాకెట్‌లు పంపిణీ చేసినట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఎంసీ.మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా భారతి సిమెంట్ ఆధ్వర్యంలో మజ్జిగ, వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తూ భక్తుల దాహం తీరుస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కంపెనీ ఏవీపీ టీ.కొండల్ రెడ్డి, చీఫ్ మార్కెటింగ్ మేనేజర్ టీ.సతీష్ కుమార్, టెక్నికల్ మేనేజర్ కే.సునీల్, సీనియర్ అధికారి (టెక్నికల్)వడ్ల శ్రీకాంత్, డీలర్లు పాల్గొన్నట్లు చెప్పారు.



జాతరలో నీటి పాకెట్లు పంపిణీ చేస్తున్న భారతీ సిమెంట్ అధికారులు

ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

మిరుదొడ్డి(దుబ్బాక): పట్టభద్రుల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు బుధవారం అధికారులు సర్వం సిద్ధం చేశారు. గురువారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు మిరుదొడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగే పోలింగ్ కేంద్రాన్ని జీయో టాగింగ్ చేయడంతో పాటు, వెబ్‌కాస్టింగ్‌ను ఏర్పాటు చేశారు. ప్రొసీడింగ్ ఆఫీసర్లు ఇద్దరు, పోలింగ్ సిబ్బంది ముగ్గురు విధులు నిర్వహించనున్నారు. కాగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దార్ ఉదయశ్రీతో పాటు, మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పర్శరాములు ఏర్పాట్లను పరిశీలించారు. మండల పరిధిలోని 632 మంది పట్టభద్రులు, 28 మంది టీచర్లు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటును సద్వినియోగం చేసుకోనున్నారు.



ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ ఉదయశ్రీ

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం ఓటింగ్ కోసం బెజ్జంకి బాలుర పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండలంలో పట్టభద్రుల ఓట్లు 1430, ఉపాధ్యాయుల ఓట్లు 46 ఉన్నట్లు తెలిపారు.